
అడ్మిషన్లు జరుగుచున్నవి
రవాణా సదుపాయం కలదు
డాక్టర్ దండి సూర్యనారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి
శ్రీ శ్రద్ధ ప్లేస్కూల్
శ్రద్ధ ప్లే స్కూల్ Right Place for Right Education
(LKG to 5th Class) A/C
కామేశ్వరి కళ్యాణమండపం దగ్గర, నందల జంక్షన్, నక్కవీధి, కలెక్టర్ బంగ్లా రోడ్డు, శ్రీకాకుళం, 99893 03703

TET - సైకాలజీ, తెలుగు ఇంగ్లీష్
DSC - SGT, SA - సోషల్, తెలుగు, బయాలజీ
సోషల్ మెథడ్స్- ఉపేంద్రనాయుడు సార్ - జూలై 7th
సైకాలజీ, ట్రైమెథడ్స్, PIE- సైదులు సార్ - జూలై 12,13,14
రైల్వే(RRB)/SSC/కానిస్టేబుల్స్/SI/BANK RPF AP
స్పెషల్ బ్యాచ్: అర్థమెటిక్, రీజనింగ్, ప్యూర్ మేథ్స్ 'చలం' రవి, M.వేణుగోపాల్, మల్లిక్, Ch.శంకర్, కృష్ణమూర్తి, Sirs చే
9AM - 7PM సెమినార్, 10 రోజులు ఫ్రీ డెమో క్లాసులు
SOLVE ACADEMY
పౌర గ్రంథాలయం, వైజాగ్-16 | RTC కాంప్లెక్స్, శ్రీకాకుళం
7569089825, 8688172010

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
బుధవారం 7-8-2024
సంపుటి: 20 సంచిక: 115
పేజీలు: 4 వెల: రూ.1

KILLER
SALE
END OF SEASON
FLAT 50% OFF
ON PURCHASE OF 2
BUY 1 GET 30%
*ON SELECTED MERCHANDISE *T&C APPLY
PALAKONDA ROAD, SRIKAKULAM






లెక్చరర్‌గా ఉన్న తిరుమల చైతన్యకు ఇన్ని బాధ్యతలా?
ఇప్పటికే డైట్ ప్రిన్సిపల్‌గా అదనపు బాధ్యతలు
తాజాగా డీఈవో, సమగ్రశిక్ష ఏపీసీగా పెత్తనం
బదిలీలు, 'నాడు-నేడు' అక్రమాలపై గతంలోనే ఫిర్యాదుల వెల్లువ
చర్యలు తీసుకోకపోగా.. ఇన్ని పోస్టుల అప్పగింతపై విమర్శలు

# నాడు అనారోగ్యం సాకు.. ఇప్పుడు మూడు పోస్టుల సోకు!

✔ నాకు ఆరోగ్యం సహకరించడం లేదు. మైల్డ్‌స్ట్రోక్ కూడా వచ్చింది. పని ఒత్తిడి కారణంగా డీఈవో బాధ్యతల నుంచి తప్పకుంటున్నాను.. అంటూ 2023 జూలై 11న తిరుమలచైతన్య పాఠశాల విద్య కమిషనరేట్‌కు ఒక అన్‌ఫిట్ సర్టిఫికెట్ పంపారు.

✔ ఏడాది తిరిగేసరికి అదే తిరుమలచైతన్య ఇప్పుడు ఏకంగా మూడు శాఖలకు బాస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఒక్క బాధ్యతే చేపట్టలేనని చేతులెత్తేసిన ఉద్యోగికి మూడు బాధ్యతలు అప్పగించడం విడ్డూరం.

✔ జిల్లాలో మరో అధికారి లేరనో లేక తిరుమల చైతన్య మాదిరిగా యాటిట్యూడ్ చూపించే అధికారి రారని భావించారో తెలియదు గానీ డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఉన్న తిరుమల చైతన్యనే తీసుకువచ్చి జిల్లా విద్యాశాఖాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అదే చేత్తో రిలీవ్ అయిన సర్వశిక్ష ఏపీసీ స్థానంలో కూడా తిరుమల చైతన్యనే కూర్చోబెట్టారు. ఇలా వద్దూ వద్దూ అన్న వ్యక్తినే తెచ్చి కూర్చోబెట్టడానికి ఆయన సమర్థత, పనితీరు మాత్రం కారణం కాదన్న విషయం విద్యాశాఖలో అందరికీ తెలుసు. ఆయన మాత్రం తాను వద్దంటున్నా ప్రభుత్వ పెద్దలు తననే నియమిస్తున్నారంటూ చెప్పకొంటున్నారట. మైల్డ్‌స్ట్రోక్ వచ్చి ఒక శాఖ పని ఒత్తిడికే తట్టుకోలేకపోయిన అధికారికి ఇప్పుడు మూడు శాఖలు ఇచ్చి ప్రాణాలు తీస్తారా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. అర్థం చేసుకోరూ.. అని స్వర్ణకమలంలో భానుప్రియ ప్రశ్నించినట్లు ఎవరూ అడగకపోవడం వల్లే పాపం ఆయనకు మూడు శాఖల బాధ్యతలు అప్పగించినట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో డీఈవోగా చేసి ఇప్పుడు వమరవల్లి డైట్‌కు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్న తిరుమల చైతన్యకు మించి తెలుగుదేశం ప్రభుత్వానికి మరో అధికారి దొరక్కపోవడం విడ్డూరం.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

'నేను మారాను. మీరు చేసిన ఉద్యమాలే కారణం. మీ వల్లే ఇక్కడికి వచ్చి డీఈవోగా బాధ్యతలు చేపడుతున్నాను. అందరూ సంపూర్ణ సహకారం అందించాలి'.. గత నెల 31న డీఈవో వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో తిరుమల చైతన్య అన్న మాటలివి. అంటే.. తాను డీఈవోగా పని చేసినప్పుడు వ్యవహరించిన తీరు వల్ల ఉపాధ్యాయులు రోడ్డెక్కారని ఆయనే ఒప్పుకున్నారన్నమాట. ఇప్పుడు మారానని చెప్పడం వెనుక ప్రధాన కారణం ఇప్పుడు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నా.. పూర్తిస్థాయి డీఈవో హోదాలో కొనసాగాలని కోరుకున్నట్లు అర్థమవుతుంది. తిరుమల చైతన్యకు పరిపాలనపై అవగాహన తక్కువ. అలా అని ఎవరైనా చెబితే ఆయనలో అపరిచితుడు బయటకొస్తాడు. రాజకీయ సిఫార్సుతో నే ప్రతిసారీ డీఈవోగా వస్తుంటారు. కానీ నాయకుల సిఫార్సులు అమలు చేయాలంటే మాత్రం ఎక్కడ లేని నిబంధనలు చెబుతుంటారు. పోనీ అలా కాదు.. ఈ కారణంతో చేయొచ్చని చెబితే ఆయనకు కోపమొస్తుంది. ఆ సిఫార్సుతో వచ్చిన ఉద్యోగి పనిని జీవిత కాలంలో జరగకుండా తొక్కేస్తారు. పదవి రానంత వరకు విధేయత చూపించే తిరుమల చైతన్య రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ డీఈవోలు, డైట్ ప్రిన్సిపాళ్లు కుదురుకున్న తర్వాత ఇక శ్రీకాకుళానికి ఎవరూ రారని నిర్ధారించుకుని అప్పుడు తన విశ్వరూపం చూపిస్తారు. అందుకే తిరుమల చైతన్య డీఈవోగా వ్యవహరించిన కాలంలో ఉపాధ్యాయ సంఘాలు ఒక్క తాటిపైకి వచ్చి ఆయన తాట తీశాయి. డీఈవో పోస్టు ఖాళీ అయితే డైట్ ప్రిన్సిపాల్‌గా ఉన్న వ్యక్తికి అదనపు బాధ్యతలు అప్పగించాలన్న ఒకే ఒక్క స్టాండర్డ్ ఇన్‌స్ట్రక్షన్‌ను ఉపయోగించుకొని తిరుమల చైతన్య డీఈవో కార్యాలయానికి వస్తున్నారు. కానీ గార మండలం వమరవల్లి ప్రభుత్వ డైట్ కాలేజీలో తిరుమల చైతన్య సీనియర్ లెక్చరర్ మాత్రమే. ఆ కాలేజీకి సుదీర్ఘ కాలంగా ప్రిన్సిపల్ లేకపోవడంతో అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. టెక్కలి డిప్యూటీ డీఈవోగా ఒకసారి, శ్రీకాకుళం డిప్యూటీ డీఈవోగా రెండుసార్లు పనిచేశారు. ఒకసారి సమగ్రశిక్షలో ఏఎంవో, పీవో, ఏపీసీగా పని చేశారు. 2023లో ఏప్రిల్‌లో డీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహించారు.

### మార్గదర్శకాలనే ఏమార్చేలా చేశారు

వైకాపా హయంలో మాజీ మంత్రి ధర్మాన చెంత చేరి పోస్టింగులు తెచ్చుకున్న తిరుమల చైతన్య ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల - మిగతా 4లో

లేడీ రిసెప్షనిస్ట్ కావలెను
కంప్యూటర్ ఆపరేటింగ్ తెలిసివుండి, కనీసం ఇంటర్ విద్యార్హత కలిగిన లేడీ రిసెప్షనిస్టు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
- వివరాలకు సంప్రదించండి -
సాయిప్రియ ట్రావెల్స్, 944 000 1447, 83411 63666

శ్రీ ముత్యాలమ్మ ఆశీస్సులతో...
హోటల్ గజపతి
స్పెషల్ దోశెలు
★ మేగీ దోశె
★ పిజ్జా దోశె
★ పాలక్ దోశె
★ పన్నీరు దోశె
★ మష్రూమ్ దోశె
★ ఘీ కారం దోశె
★ కారంపల్లి దోశె
★ స్వీట్ కార్న్ దోశె
★ చీజ్ ఆన్ పన్నీర్ దోశె
★ మంచూరియన్ దోశె
9581511345
9701711345
ఇప్పుడు ప్రశాంతమైన ఎ.సి. వాతావరణంలో మరింత సౌకర్యవంతంగా ఎటువంటి అధనపు చార్జీలు లేకుండా ప్రత్యేకంగా సర్వీసు అందిస్తున్నాం. విచ్చేయండి...



-ఉద్యమించిన విద్యార్థులను రజాకార్లతో పోల్చిన హసీనా
-బంగ్లా స్వాతంత్ర్య పోరాటవాదులపై అప్పట్లో వారి అరాచకం
-రిజర్వేషన్ల ఉద్యమం ముసుగులో మళ్లీ తెరపైకి
-మరోవైపు లండన్ నుంచి పావులు కదిపిన ఖలీదా తనయుడు
-పాక్ ఐఎస్ఐ, చైనాల సహకారంతో కుట్ర అమలు

ఒకప్పుడు తూర్పు పాకిస్థాన్ పేరుతో పాకిస్థాన్ దేశంలో భాగంగా ఉన్న ప్రాంతానికి భారత్ సాయంతో పోరాటం సాగించి స్వేచ్ఛ ప్రసాదించడం ద్వారా స్వతంత్ర బంగ్లాదేశ్ పితామహుడిగా ఖ్యాతిగాంచిన షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె.. ఏకధాటిగా 15 ఏళ్లుగా, మొత్తంగా చూస్తే ఇరవై ఏళ్లపాటు అంటే అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డు షేక్ హసీనా సొంతం. ఆ రికార్డులు, పేరు ప్రఖ్యాతులన్నీ ఒక్క ఉద్యమంతో కొట్టుకుపోయాయి. అత్యంత అవమానకరమైన రీతిలో పదవిని వీడి.. కట్టుబట్టలతో దేశం నుంచి పారిపోయి పొరుగుదేశం భారత్‌లో ఆశ్రయం పొందాల్సిన దుర్గతి పట్టించాయి. మరోవైపు రిజర్వేషన్ల పేరుతో ప్రారంభమైన ఉద్యమం రాజకీయ రూపు దాల్చి మొత్తం దేశాన్ని దహించివేస్తోంది. హసీనా ప్రభుత్వం కూలిపోయి సైన్యం రంగప్రవేశం చేసినా మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నా అల్లర్లు, హింస, విధ్వంసాలు ఏమాత్రం ఆగకపోగా అల్లరిమూకలు పేట్రేగి మైనారిటీలైన హిందువులపైనా, చివరికి సొంతవర్గమైన ముస్లింలపైనా దాడులకు తెగబడుతున్నారు. ఈ విపత్కర పరిణామాలకు హసీనా రాజకీయ ప్రత్యర్థుల అధికార దాహం.. దానికి దన్నుగా నిలిచిన చైనా, పాకిస్తాన్‌లే కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు రిజర్వేషన్ల వివాదంపై ప్రధాని హోదాలో షేక్ హసీనా చేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా విద్యార్థి, యువజన వర్గాల్లో విద్వేషాగ్ని రగల్చి.. మొత్తం దేశాన్ని తగులబెట్టే స్థితికి తీసుకొచ్చాయి.



# రజాకార్లు.. జియా కుమారుడే కుట్రదారులు!

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

'యువత ముసుగులో సంఘవిద్రోహ శక్తులు ఉద్యమం పేరుతో దేశంలో అరాచకం సృష్టిస్తున్నాయి'
'రిజర్వేషన్లను బంగ్లాదేశ్ విముక్తి పోరాట యోధుల వారసులకు కాకుండా రజాకార్ల మనవలకు ఇస్తామా'..

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం జరుగుతున్న సమయంలో దేశ ప్రధాని హోదాలో షేక్ హసీనా చేసిన ఈ వ్యాఖ్యలు ఉద్యమకారులను తీవ్రంగా రెచ్చగొట్టాయి. రిజర్వేషన్ ఉద్యమం తీవ్రమై హింసాత్మకంగా మారడానికి దారితీశాయి. ముఖ్యంగా ఉద్యమిస్తున్న విద్యార్థి, యువజనులు రజాకార్లన్నట్లు మాట్లాడటం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. మనదేశంలో రజాకార్లు అంటే నిజాం పాలనలో జరిగిన అరాచకాలే గుర్తుకొస్తాయి. తెలంగాణ ప్రాంతంలోని



హైదరాబాద్ సహా అనేక ప్రాంతాల్లో 1948 ప్రాంతంలో నిజాం ప్రభుత్వానికి చెందిన కాశీం రజ్వీ నేతృత్వంలో రజాకార్లు చేసిన దురాగతాలకు అంతే లేదు. మతోన్మాదంతో రెచ్చిపోయిన ఈ మూకలు హత్యలు, మానభంగాలు, దోపిడీలతో విశృంఖలంగా వ్యవహరించారు. ఈ రజాకార్లతో బంగ్లాదేశ్‌కు సంబంధం ఏమిటి? హసీనా ఎందుకు ఉద్యమకారులను ఆ పదంతో సంబోధించారు? అన్న సంశయం కలగవచ్చు. దేశ విభజన తర్వాత ఏర్పడిన పాకిస్తాన్‌లోనూ ఒక రజాకార్ వ్యవస్థ ఏర్పాటైంది. ఈ వ్యవస్థ ఇస్లాంలోని తమ వర్గీయులపైనే దాడులు జరిపి నెత్తుటేరులు పారించింది. ఈ పరిణామాలతో రజాకార్ అంటే అరచకాలే గుర్తుకొస్తాయి. అయితే పర్షియన్, ఉర్దూ భాషల్లో రజాకార్ అంటే స్వచ్ఛంద సహాయకుడు అని అర్థం. కానీ ఆ అర్థాన్ని రజాకార్లు మార్చేసి రజాకార్ అంటే అరాచకవాదులని అనుకునేలా చేశారు.

### బంగ్లా స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా..

తమ భూభాగంలోని వనరులను తమకు కాకుండా ఇతర ప్రాంతాల అభివృద్ధికి వినియోగించడమే కాకుండా తమను పాక్ పాలకులు అణిచివేస్తున్నారన్న ఆగ్రహంతో పాకిస్తాన్‌తో విడిపోవాలని తూర్పు పాకిస్తాన్ వాసులు బంగ్లాదేశ్ విముక్తి పోరాటం పేరుతో 1971లో ఉద్యమించారు. దీన్ని ఎదుర్కొనేందుకు నాటి పాక్ పాలకులు ప్రయోగించిన అస్త్రం పేరే రజాకార్. బంగ్లావాసులు స్వాతంత్ర్య ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారే ఇందులో సభ్యులుగా చేరారు. పాక్ సైన్యం అండతో 1971 మేలో జమాతే ఇస్లామీ సీనియర్ సభ్యుడు మౌలానా అబుల్ కలాం మొహమ్మద్ యూసుఫ్ రజాకార్ల సమితిని ఏర్పాటు చేశారు. బంగ్లా ఉద్యమానికి మద్దతు ఇచ్చినవారిపై దాడులు, సామూహిక హత్యలు, అత్యాచారాలకు రజాకార్ సమితి సభ్యులు తెగబడ్డారు. ప్రజలను ఊచకోత కోశారు. లక్షలాది మహిళల మానప్రాణాలను దోచుకున్నారు. ఫలితంగా ఆధునిక బంగ్లాదేశ్‌లో రజాకార్ అనే పదాన్ని ఒక నీచమైన అర్థంలో వాడటం ప్రారంభించారు. దూషించడానికి, పరువు తీయడానికి కూడా దీన్నే పర్యాయపదంగా వాడుతుంటారు. రజాకార్ల ముసుగులో స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో యుద్ధనేరాలకు, అరాచకాలకు పాల్పడిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకునేందుకు 2010లో షేక్ హసీనా ప్రభుత్వం అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. దాంతో నాటి అకృత్యాలకు కారకుడైన మహమ్మద్ యూసఫ్ 2013లో అరెస్టయ్యాడు. అయితే గుండె పోటుతో జైలులోనే మరణించాడు. కాగా 1971 విముక్తి



Training of Rajakar Forces in 1971

పోరాటాన్ని అణచివేసేందుకు పాక్ సైన్యంతో కలిసి పనిచేసిన 10,789 మంది రజాకార్ల జాబితాను 2019లో హసీనా సర్కారు విడుదల చేసింది. పలువురు ప్రముఖులతోపాటు నిషేధిత జమాత్-ఇ-ఇస్లామీ పార్టీకి చెందిన చాలామంది ఈ జాబితాలో ఉన్నారు. వారంతా హసీనాపై పగ తీర్చుకునేందుకు ఎదురు చూస్తున్న తరుణంలో విద్యార్థులు చేపట్టిన రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం దారి తప్పి వారి చేతిలో ఆయుధంగా మారిందని ప్రచారం జరుగుతోంది.

### ఖలీదా కుమారుడి కుట్ర

రిజర్వేషన్ల ఉద్యమం భయానకంగా మారడం వెనుక నాటి రజాకార్లతోపాటు మరో వ్యక్తి కుట్ర కూడా ఉన్నట్లు ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తోంది. అతనే తారిక్ రహ్మాన్. అతను మరెవరో కాదు.. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీకి యాక్టింగ్ ఛైర్మన్. ఒకప్పుడు పలు ఆరోపణలతో దేశం విడిచి పారిపోయిన రహ్మాన్ లండన్ నుంచే షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర అమలు చేశాడని ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. బంగ్లా మాజీ అధ్యక్షుడు జనరల్ జియా ఉర్ రహ్మాన్, మాజీ ప్రధాని ఖలీదా జియా దంపతుల కుమారుడైన ఈయన చిన్న వయసులో రాజకీయాల్లోకి వచ్చి తల్లిదండ్రుల పరపతితో కీలకపాత్ర పోషించారు. 2009లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 2018లో ఢాకాలో జరిగిన గ్రెనేడ్ దాడి కేసులో తారిక్‌కు జీవిత ఖైదు పడింది. దాంతో దేశం నుంచి పారిపోయి విదేశాల్లో తలదాచుకుంటున్నాడు. అతన్ని పరారీలో ఉన్న నేరస్తుడిగా బంగ్లాదేశ్ ప్రభుత్వం - మిగతా 4లో

• ఎడిటోరియల్

# సునీతావిలియమ్స్ భవితకు డెడ్‌లైన్?

మూడుసార్లు అంతరిక్షంలోకి వెళ్లిన ఏకైక మహిళగా సునీతా విలియమ్స్ కొత్త చరిత్ర సృష్టించారు. కానీ ఇప్పుడదే అంతరిక్షంపై ఆమె చివరి రోజులు గడిపేస్తారా? అన్న అనుమానాలు, ఆందోళన పెరుగుతున్నాయి. భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి(ఆస్ట్రోనాట్) అయిన సునీత ప్రస్తుతం రోదసీలో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోనే ఉన్నారు. ఆమె భూమికి తిరుగు ప్రయాణం ఇప్పటికే పలుమార్లు వాయిదా పడింది. ఆమె ఎప్పుడు తిరిగి వస్తారన్నది కూడా ఆమెను రోదసీలోకి పంపిన అమెరికా స్పేస్ ఏజెన్సీ నాసా కూడా చెప్పలేకపోతోంది. నిర్ణీత గడువుకు మించి అక్కడ ఉంటే వాతావరణ మార్పులు, ఇతరత్రా కారణాల వల్ల ఆస్ట్రోనాట్ల ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మరోవైపు ఆమెను భూమిపైకి తీసుకురావాల్సిన స్పేస్ షటిల్‌లో సాంకేతిక లోపాలను ఇంతవరకు సరిచేయలేకపోవడం వల్ల ఆమెతో పాటు సహచర వ్యోమగామి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. అంతరిక్షంలో అడ్వాన్స్‌డ్ పరిశోధనలు, అధ్యయనాల కోసం నాసా జూన్ ఐదో తేదీన సునీతావిలయమ్స్‌తో పాటు బుచ్‌విల్మోర్‌ను అంతరిక్షంలోకి పంపింది. ప్రపంచ ప్రఖ్యాత బోయింగ్ సంస్థకు చెందిన స్టార్‌లైనర్ స్పేస్ క్రాఫ్ట్‌లో వారిద్దరూ రోదసీలో ఏర్పాటు చేసిన అంతరిక్ష పరిశోధన కేంద్రానికి చేరుకుని రెండు నెలలు దాటింది. షెడ్యూల్ ప్రకారం వారు పది రోజులే ఐఎస్ఎస్‌లో గడిపిన అనంతరం జూన్ 14న తిరుగు ప్రయాణమై 15న భూమిపైకి చేరుకోవాల్సి ఉంది. అయితే వీరిని తీసుకెళ్లిన, తిరిగి తీసుకురావాల్సిన స్టార్‌లైనర్ స్పేస్ క్రాఫ్ట్ సాంకేతిక సమస్యలకు గురై మొరాయించింది. నాసా శాస్త్రవేత్తలు ఆ సమస్యలను సరిదిద్ది దాన్ని ప్రయాణానికి సిద్ధం చేయడానికి నాసాలోని కంట్రోల్ కేంద్రం నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించడంలేదు. ఫలితంగా వ్యోమగాములు తిరుగు ప్రయాణం నిరవధికంగా వాయిదా పడింది. తొలుత జూలై 5న, ఆ తర్వాత జూలై 24న వారు తిరిగి వస్తారని నాసా చేసిన ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. అతిపెద్ద విమానాల తయారీ సంస్థ అయిన బోయింగ్ కంపెనీ తయారుచేసిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌ను రూపొందించింది. అయితే ఆస్ట్రోనాట్లను తీసుకుని రోదసీలోకి వెళ్లే ముందే ఈ స్పేస్‌క్రాఫ్ట్‌లో పలు లోపాలు తలెత్తి ప్రయాణం రెండుసార్లు వాయిదాపడింది. చివరికి మూడో ప్రయత్నంలో నింగిలోకి వెళ్లగలిగింది. అయితే ఐఎస్‌సీకి చేరుకున్న తర్వాత మళ్లీ సాంకేతిక సమస్యలు మొదలయ్యాయి. రాకెట్‌లో కీలకమైన హీలియం గ్యాస్ లీక్ కావడం, థ్రస్టర్లు పనిచేయకపోవడం వల్ల స్పేస్ షటిల్ మొరాయించింది. ఇప్పుడు ఆస్ట్రోనాట్లు ఎప్పుడు తిరిగి వచ్చే అవకాశం ఉందన్నది శాస్త్రవేత్తలు కూడా చెప్పలేకపోతున్నారు. స్టార్‌లైనర్ పనిచేయకపోవడంతో ప్రత్యామ్నాయంగా ఎలన్‌మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్‌ను అంతరిక్ష కేంద్రానికి పంపి వ్యోమగాములను రప్పించడానికి నాసా వర్గాలు చర్చలు జరిపాయి. కానీ ఆ ప్రతిపాదన కూడా నిలిచిపోయింది. ఇప్పుడు మరో కొత్త సమస్య వచ్చిపడింది. సునీతావిలియమ్స్, బుచ్ విల్మోర్‌లను కచ్చితంగా ఈ నెల 18 లోపు అంతరిక్ష కేంద్రం నుంచి తిరిగి రాకపోతే ముప్పు తప్పదని తెలుసుకున్న నాసా శాస్త్రవేత్తలో టెన్షన్ మొదలైంది. ఎందుకంటే క్రూ-9 పేరుతో మరో అంతరిక్ష యాత్రకు షెడ్యూల్ ఫిక్స్ అయ్యింది. ఆ మేరకు ఈ నెల 18న నలుగురు సిబ్బందిని తీసుకుని క్రూ-9 అంతరిక్ష కేంద్రానికి చేరుకోనుంది. దానికి మార్గం సుగమం చేసేందుకు ఇప్పటికే అక్కడ డాకింగ్ పోర్టు వద్ద ఉన్న స్టార్ లైనర్‌ను అన్ డాకింగ్ చేయాలి. అంటే క్రూ-9 వెళ్లేలోపే సునీతావిలియమ్స్, బుచ్ విల్మోర్‌లను తీసుకుని స్టార్‌లైనర్ రోదసీని వీడి భూమిపైకి రావాల్సి ఉంటుంది. వ్యవధి తక్కువగా ఉండటం, సమస్యను పరిష్కరించే మార్గాలు కనిపించకపోవడంతో అది జరిగే పరిస్థితి దాదాపు లేదు. రిపేర్లు చేయకుండా స్టార్‌లైనర్‌ను అక్కడి నుంచి కదిలించే పరిస్థితి లేకపోవడం, ఇప్పటికే క్రూ-9 ప్రయాణానికి కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో అంతరిక్షంలో రెండు వ్యోమనౌకలు ఢీకొనే ప్రమాదం ఉంది. అవి పోయినా అంతరిక్ష కేంద్రంలో ఉన్న సునీత, విల్మోర్‌లను తీసుకురావడానికి మరో స్పేస్‌క్రాఫ్ట్‌ను ఇప్పటికిప్పుడు పంపించే పరిస్థితి ఉండదు. అలాగని వారిద్దరిని సుదీర్ఘకాలం అంతరిక్షంలోనే ఉంచడం కూడా క్షేమం కాదు. ఇప్పటికే గడువుకు మించి చాలారోజులు ఆస్ట్రోనాట్‌లు అంతరిక్షంలో ఉండిపోయారు. ఇంకొన్ని రోజులు అక్కడే ఉండిపోతే అది కచ్చితంగా వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి అనేక దుష్ఫలితాలకు దారితీస్తుంది. భూమిపై ఉండే వాతావరణానికి, అంతరిక్షంలో వాతావరణానికి చాలా తేడా ఉంటుంది. నిర్ణీత గడువు కోసం ముందుజాగ్రత్తలు తీసుకుని ఆస్ట్రోనాట్లను అంతరిక్షంలోకి పంపుతుంటారు. కానీ ఇప్పటికే రెండు నెలలుగా సునీత అంతరిక్షంలో ఉండిపోవడం వల్ల కంటి సమస్యలు పెరుగుతాయి. కళ్లలోంచి ఉత్పత్తి అయ్యే కొన్ని రకాల ఎంజైములు భూవాతావరణంలో మనిషి కంటి నుంచి దిగువ భాగంలోకి ప్రవిస్తాయి. అదే అంతరిక్షంలో అయితే ఎగువ భాగంలోకి పాకి మెదడులో చేరే అవకాశం ఉందంటున్నారు. అదే జరిగితే మెదడు భాగాలు దెబ్బతిని ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందంటున్నారు. ఈ భయంతోనే ఇటీవలే నాసాలో ఉన్న ఐఎస్‌సీ మానిటరింగ్ కేంద్రం నుంచి వైద్యులు ఆస్ట్రోనాట్లకు కంటి పరీక్షలు జరిపినట్లు నాసావర్గాలు వెల్లడించాయి. ఈ పరిస్థితుల్లో అంతరిక్షంలో ఉండిపోయిన సునీతావిలియమ్స్, బుచ్ విల్మోర్‌ల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతోంది.

# ఇండోనేషియా పోటీలకు పూర్ణారావు ఎంపిక

## రూ.1.5 లక్షలు కేంద్ర మంత్రి సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఇండోనేషియాలో ఈఏడాది సెప్టెంబర్లో జరగనున్న అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కి ఎంపికైన టెక్కలి మండలం శ్రీరంగం గ్రామానికి చెందిన చాపర పూర్ణారావుకు రూ. 1.5 లక్షల స్పాన్సర్‌షిప్‌ను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మంజూరు చేశారు. ఈనెల 4న కేంద్ర మంత్రిని కలిసి పూర్ణారావు ఆర్థిక సమస్యను వివరించడంతో స్పందించిన కేంద్రమంత్రి డ్రీమ్ లెవెన్ క్రీడా సంస్థ ప్రతినిధులతో మాట్లాడి వంద శాతం స్పాన్సర్ షిప్ మంజూరు చేయించారు. ఇండోనేషియా పర్యటనకు అవసరమైన రూ. 1.5లక్షల నిధులను కేటాయించేలా చర్యలు తీసుకొని పూర్ణారావుకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేశారు. స్పాన్సర్ షిప్ లభించడంపై పూర్ణారావు స్పందిస్తు 21ఏళ్ల వయస్సులో రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో వెన్నెముక పూర్తిగా దెబ్బతిన్నా మనో ధైర్యంతో వైకల్యాన్ని ఎదిరించి పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా ఎదిగినట్టు తెలిపాడు. దేశం తరపున వివిధ అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొని 7పతకాలు సాధించడంతో పాటు 33వ ర్యాంకులో



కొనసాగుతున్నట్టు పేర్కొన్నాడు. ఇండోనేషియా ఛాంపియన్ షిప్‌కు ఎంపికై ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సహకారం కోరిన వెంటనే స్పందించారని కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్పీని కలిసిన పలాస డీఎస్పీ శ్రీను

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

సాధారణ బధిలీలో భాగంగా ఇటీవల కాశీబుగ్గ పోలీసు సబ్ డివిజన్ నూతన డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీనివాసరావు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలని ఎస్పీ సూచించారు.



# చిన్నారికి సైకిల్ బహుకరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పీఎన్ కాలనీలో నివాసముంటున్న జె.లక్ష్మణరావు గత కొంత కాలంగా లివర్‌కు సంబంధించిన కేన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలిసిందే. భార్య కూడా వికలాంగురాలని, ఇద్దరు చిన్నపిల్లలతో జీవితాన్ని నెట్టుకొస్తున్నార న్నారని తెలుసుకున్న రాగోలుకు చెందిన జరుగుల్ల రాజు లక్ష్మణరావు కుమార్తెకు సైకిల్ బహూకరించారు. ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమాశంకర్ ద్వారా విషయం తెలుసుకున్న రాజు సైకిల్ అందించారు. సుప్రజ మాట్లాడుతూ కుటుంబానికి సాయంగా మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను ఇటీవల ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ద్వారా అందజేశామని గుర్తుచేశారు. అలాగే కొంత నగదుని కూడా నేరుగా బాధిత కుటుంబానికి అందేలా చూస్తున్నారని, దాతలు ముందుకు వచ్చి ఈ కుటుంబానికి అండగా నిలవాలన్నారు. నగరంలో కిమ్స్ వైద్యశాల దగ్గరలోని శ్రీనివాస మెడికల్ ఫార్మసీ ఉద్యోగి జరుగుల్ల రాజుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉర్లం శివతేజ, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి పొడుగు చరణ్, రత్నాల మహాలక్ష్మి, అల్లాడ నవీన్, మదర్స్ లవ్ సుప్రజ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# చేనేత వస్త్రాలు.. సైకిల్‌పై పార్లమెంటుకు



## తెలుగుతనం ఉట్టిపడేలా పంచెకట్టుతో ప్రత్యేక ఆకర్షణగా కలిశెట్టి

**న్యూఢిల్లీ:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతకు చెందిన పంచె, లాల్చీ, కండువా వస్త్రాలను ధరించి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం జరిగిన పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యారు. అప్పలనాయుడు పంచెకట్టుతో వెళ్లి పార్లమెంటు సమావేశాల్లో అందరిని ఆకట్టుకున్నారు. పార్లమెంట్ హాలుకు దగ్గరలో ఉన్న ఆంధ్రభవన్‌లో గల హ్యాండ్లూమ్ షాప్‌కి ఉదయాన్నే అప్పటికప్పుడు వెళ్లి పంచె, లాల్చీ, కండువా తదితర చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. అవే చేనేత వస్త్రాలను ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని అప్పలనాయుడు మాట్లాడుతూ చేనేత కుటుంబాలను ప్రోత్సహించేందుకు పార్లమెంట్‌లో ఉన్నా, వెలుపల ఉన్నా ప్రతి శుక్రవారం చేనేత వస్త్రాలను ధరించేందుకు నిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధికి వ్యవసాయ రంగంతో పాటు ముఖ్యమైన వనరులలో చేనేత రంగం ఒకటని, చేనేత రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భారత పౌరుడిగా ప్రతిఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. మహిళా సాధికారత గూర్చి నేరుగా ప్రస్తావించే రంగం చేనేత అని పేర్కొన్నారు. 2015లో ఎన్డీయే ప్రభుత్వంలో అప్పటి దేశ ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆరంభించిన నాటి నుంచి ప్రతి ఏడాది ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. రైతు కుటుంబాల మాదిరిగా చేనేత రంగం కోసం పాటుపడుతున్న చేనేత కుటుంబాలకు కూడా సమానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ప్రాధాన్యత తీసుకొని, మరింత అధ్యయనం చేసి చేనేత రంగాన్ని ముందుకు తీసుకెళ్లడం ద్వారా చేనేత కుటుంబాల వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.



# నందమూరి నాయిక కాబోయే వేళ..!

అతిలోక సుందరి శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వీకపూర్ టాలీవుడ్ లో ఘనమైన ఆరంగేట్రం చేస్తోంది. ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి అగ్ర హీరోల సరసన జాన్వీ రంగ ప్రవేశం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఇంతలోనే శ్రీదేవి రెండో కుమార్తె ఖుషి కపూర్ కూడా టాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తోందంటూ ప్రచారం సాగుతోంది. తాజా ఊహాగానాల ప్రకారం.. నందమూరి బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ సరసన ఆరంగేట్రం చేయడానికి చర్చలు జరుపుతోందని తెలుస్తోంది. ప్రస్తుతం చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయి. సెప్టెంబర్ 1న మోక్షజ్ఞ తొలి చిత్రంపై అధికారిక ప్రకటన వెలువరించనుండగా, సెప్టెంబర్ 6న గ్రాండ్ గా లాంచ్ కానుంది. ఈ చిత్రానికి హనుమాన్ ఫేమ్ ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించనున్నారు.

ఖుషి ఇప్పటికే హిందీలో 'ది ఆర్చీస్' అనే వెబ్ సిరీస్ లో నటించింది. అలాగే రెండు హిందీ చిత్రాల్లోను నటిస్తోంది. తదుపరి టాలీవుడ్ ఎంట్రీపై పక్కా ప్రణాళికతో సిద్ధమవుతోంది. మరోవైపు ఖుషి కపూర్ సోషల్ మీడియా క్వీన్ గా, మ్యాగజైన్ కవర్ గాళ్‌గా యువతరంలో గిలిగింతలు పెడుతోంది. తాజాగా బ్రైడల్ ఆసియా కవర్ పేజీపై ఖుషి స్టన్నింగ్ లుక్ తో కనిపించింది. ముఖ్యంగా సోదరి జాన్వీతో పోటీపడుతూ తన గ్లామర్‌ని ఆవిష్కరించేందుకు ఖుషి సిద్ధంగా ఉందని అర్థమవుతోంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

# సంజయ్‌దత్‌లా మారిపోయిన రామ్



'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా తయారైన 'డబుల్ ఇస్మార్ట్' ఈనెల 15న విడుదలకు సిద్ధమైంది. ట్రైలర్‌లోనే పూరిలోని మాస్ మొత్తం బయటపడిపోయింది. రామ్ డైలాగులు, వేసిన మాస్‌స్టెప్పులు ఇవన్నీ థియేటర్లకు ప్రేక్షకుల్ని రప్పించే అంశాలే. రామ్‌కు కూడా రొటీన్‌కి భిన్నంగా నటించే స్కోప్ ఈ సినిమాతో దక్కిందట. కొన్ని సన్నివేశాల్లో రామ్ సంజయ్‌దత్‌ని ఇమిటేట్ చేస్తాడని తెలుస్తోంది. సంజూకంటూ సెపరేట్ బాడీ లాంగ్వేజ్ ఉంది. తన డైలాగ్ డెలివరీ భిన్నంగా ఉంటుంది. ఇవన్నీ రామ్ ఇమిటేట్ చేయబోతున్నాడట. సంజూ – రామ్‌ల మధ్య స్నేహం, అందులోంచి పుట్టుకొచ్చిన వైరం ఈ సినిమాలో ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయని తెలుస్తోంది. 'డబుల్ ఇస్టార్ట్‌' పూరి కొన్ని యదార్థ సంఘటనల్ని చొప్పించడానికి తెలుస్తోంది. ఒకరి ఆలోచనలు, ఐడియాలజీ మరొకరికి ట్రాన్స్ఫర్ చేయడం 'డబుల్ ఇస్మార్ట్' కథ. ఢిల్లీకి చెందిన ఓ వ్యాపార వేత్త సేమ్ టూ సేమ్.. ఇలాంటి ప్రయోగానికే పూనుకొన్నాడని అప్పట్లో వార్తలొచ్చాయి. అఫ్‌కోర్స్ ఆ ప్రయోగం సక్సెస్ కాలేదనుకోండి. ఒకవేళ సక్సెస్ అయితే ఏమిటన్న పాయింట్‌తోనే పూరి ఈ కథ రాసుకొన్నాడని తెలుస్తోంది. నిజానికి 'ఇస్టార్ట్ శంకర్'లో కథేం ఉండదు. జస్ట్ ఆ ఐడియా, రామ్ క్యారెక్టరైజేషన్ మాస్ ని బాగా పట్టేశాయి. అయితే 'డబుల్ ఇస్మార్ట్‌' మాత్రం పూరి బలమైన కథని, ఎమోషన్‌నీ రాసుకొన్నాడని తెలుస్తోంది. దానిపైనే పూరి నమ్మకం పెట్టుకొన్నాడు.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

# మొన్న కృతి.. నిన్న శ్రీలీల.. నేడు భాగ్యశ్రీ!



**టాలీవుడ్ లో హీరోయిన్లకు కొరత ఉండదు. ప్రతీ వారం ఓ కొత్త భామ ఇండస్ట్రీకి పరిచయం అవుతూనే ఉంటుంది. వారిలో కొందరు వరుస అవకాశాలు దక్కించుకుని కొన్నాళ్లపాటు హవా కొనసాగిస్తారు. మరికొందరు మాత్రం ఒకటీ రెండు చిత్రాలకే పరిమితం అవుతుంటారు. అందుకే క్రేజ్ ఉన్నప్పుడే దాన్ని క్యాష్ చేసుకోవాలని భావిస్తుంటారు. ఇప్పుడు భాగ్యశ్రీ బోర్సే అనే మరో కొత్త హీరోయిన్ తెలుగు తెరకు పరిచయం కాబోతోంది. ఫస్ట్ మూవీ రిలీజ్ కాకుండానే క్రేజీ ఆఫర్స్ అందుకుంటూ దూసుకుపోతోంది.**

రవితేజ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'మిస్టర్ బచ్చన్'. ఈ చిత్రంతోనే అందాల ముద్దుగుమ్మ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తోంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ లో అమ్మడు అందరి దృష్టిని ఆకర్షించింది. పోస్టర్లతోనే యువ హృదయాలను కొల్లగొట్టింది. పాటల్లో తన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మాస్ సాంగ్ లో రవితేజ ఎనర్జిని మ్యాచ్ చేస్తూ స్టెప్పులేయడమే కాదు, మెలోడీ సాంగ్ లో తన గ్లామర్ తో స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకుంది. దీంతో ఇప్పుడు భాగ్యశ్రీ యూత్ కి క్రష్ గా మారిపోయింది. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఈమె సందడే కనిపిస్తోంది. పూణేకు చెందిన భాగ్యశ్రీ బోర్సే.. మోడలింగ్ రంగంలో గుర్తింపు తెచ్చు కుని, పలు బ్రాండ్ ఎండార్స్మెంట్స్ చేసింది. 'యారియాన్ 2' మూవీతో బాలీవుడ్‌లో తెరంగేట్రం చేసింది. ఇటీవల 'చందు ఛాంపియన్' చిత్రంలో స్పెషల్ రోల్ చేసింది. ఈ క్రమంలో 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అయింది. అయితే ఈ మూవీ రిలీజ్ కాకుండానే అమ్మడు పెద్ద బ్యానర్స్‌లో స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు అందుకుంటున్నట్లు తెలుస్తోంది.

యువ హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి కాంబోలో రూపొం దుతున్న 'వీడీ-12' సినిమాలో భాగ్యశ్రీ బోర్సేని హీరోయిన్‌గా తీసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలానే హీరో నాని నటించే ఓ మూవీ కోసం ఆమెను సంప్రదిస్తున్నారని అంటున్నారు. ఇప్పటికైతే అందం, అదృష్టం రెండూ ఈ ముద్దుగుమ్మకు కలిసొచ్చాయి. 'మిస్టర్ బచ్చన్' విడుదలైన తర్వాత అభినయం కూడా ఉందని ప్రూవ్ అయితే, అనతి కాలంలోనే క్రేజీ హీరోయిన్ గా మారే ఛాన్స్ ఉంది.

యంగ్ హీరోయిన్లలో కృతిశెట్టి, శ్రీలీల మాత్రమే ఓవర్ నైట్ స్టార్ డమ్ అందుకున్నారు. 'ఉప్పెన' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన కృతి.. బ్యాక్ టూ బ్యాక్ స్టార్ హీరోల చిత్రాల్లో నటించే అవకాశాలు కొట్టేసింది. అయితే లైన్‌గా రెండు మూడు ఫ్లాప్స్ పడటంతో స్పీడ్ తగ్గించింది. మరోవైపు 'పెళ్లి సందడి'తో తెలుగులోకి వచ్చిన శ్రీలీల.. ధమాకా తర్వాత చేతినిండా ప్రాజెక్ట్స్ తో బిజీగా మారిపోయింది. కానీ ఈ మధ్య పరాజయాలు పలకరించడంతో స్లో అండ్ స్టడీగా వెళ్తోంది. ఇప్పుడు భాగ్యశ్రీ బోర్సే కూడా వస్తూ వస్తూనే వరుసగా ఆఫర్స్ దక్కించుకుంటోంది. మరి టాలీవుడ్ లో అమ్మడి కెరీర్ ఎలా సాగుతుందో చూడాలి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..



# ఆ కలల ప్రపంచం నిర్మాణం వెనుక ఓ ఆఫ్రికన్ ఆలోచన!

గోవా అంటే ఓ కలల ప్రపంచం. ల్యాండ్ ఆఫ్ సన్.. స్యాండ్ ఆఫ్ బీచెస్. భారతదేశ యువతే కాకుండా వివిధ విదేశీయులకూ ఓ టూరిస్ట్ హబ్. చాలామంది యువత కచ్చితంగా ఒక్కసారైనా గోవా చూడాలనుకోకపోతే ఆ యువకుల్లో ఏదో లోపమున్నట్టే అన్నంతగా క్రేజీ టూర్ గోవా. ఒక్క యువతేంటి..? 60లో పడ్డవారిని కూడా 20ల్లోకి తీసుకురాగల్గే ఓ విహారయాత్ర. ఫ్యామిలీస్‌తో కూడా వెళ్లి గోవా టూరిజాన్ని అనుభూతి చెందేవారి సంఖ్యా తక్కువేమీ కాదు. అయితే, అలాంటి గోవా టూరిజం వెనుక ఉందెవ్వరు..? తెలుసుకోవా లంటే ఒక్కసారి ఈ కథనంతో ఆ గోవా వరకూ వెళ్లొద్దాం రండి. గోవా టూరిజం గురించి మాట్లాడుకోవాలంటే.. బీజం వేసిన వారి గురించి చెప్పుకోవాలి. అదే సమయంలో గోవాలో పాపులరైన టిటోస్ నైట్ క్లబ్ గురించి మాట్లాడుకోవాలి.

## గోవా పర్యాటకానికి దిక్సూచైన.. ఓ ఆఫ్రికన్ బతుకుదెరువు కథ!




టిటోస్ క్లబ్ వ్యవస్థాపకుడు హెన్రీ డిసౌజా. ఈయనే ఇవాల్టి గోవా టూరిజానికి ఆద్యుడు. హెన్రీ డిసౌజా ఆఫ్రికా నుంచి వచ్చిన ఓ వలసవాది. 1971లో ప్రస్తుతం మనం బాగా బీచ్‌గా పిలుచుకునే గోవాలోని సముద్రతీరంలో.. షాక్ అని పిల్చుకునే.. ఓ గుడిసె తరహా చూడముచ్చటగా ఉండే ఓ షెల్టర్‌ను ఏర్పాటు చేశాడు. దానికే టిటోస్ అని నామకరణం చేసి ఓ చిన్న హోటల్‌తో నాడే హాస్పిటాలిటీ రంగంలోకి అడుగుపెట్టాడు.

అయితే తండ్రి మరణం తర్వాత ఆయన కుమారులైన రికార్డో డిసౌజా, తన సోదరుడైన డేవిడ్ డిసౌజాతో కలిసి కేవలం పద్నాలుగేళ్ల వయస్సులోనే ఈ హోటల్‌ను టేకప్ చేయాల్సిన గత్యంతరం లేని పరిస్థితి వచ్చింది. అప్పుడు రికార్డో, డేవిడ్ డిసౌజాల బ్యాంక్ బ్యాలెన్స్ కేవలం 45 రూపాయలు మాత్రమే. ఓవైపు తండ్రి మరణం, మరోవైపు ఊరు కాని ఊరు, ఓ చిన్న హోటలే ఆధారం.. అలాంటి సమయంలో ఎన్నో సవాళ్లనెదుర్కొని.. తన హోటల్‌కు ఓ గుర్తింపు తీసుకొచ్చి ఇప్పుడు 350 కోట్ల రూపాయల టర్నోవర్‌తో టిటోస్‌ను హాస్పిటాలిటీ రంగంలో అప్రతిహతంగా నడిపిస్తున్నారు డిసౌజా సోదరులు. అంతేనా.. ఇవాళ గోవా టూరిజం పేరిట అక్కడ వెలిసిన హోటల్స్, రెస్టారెంట్స్, రిసార్ట్స్, నైట్ క్లబ్స్, క్యాసినోస్.. ఇలా అన్నింటికీ ఈ టిటోసే మూలమైతే.. అందుకు ఆద్యులు తండ్రి హెన్రీ డిసౌజా వాటిని అభివృద్ధి చేసి.. గోవాను భారతదేశంలోని మిగిలిన స్టేట్స్‌తో పోలిస్తే భిన్నంగా నిలబెట్టింది రికార్డో అండ్ డేవిడ్ డిసౌజా.






గమ్మత్తేంటంటే.. టిటోస్‌లో ఆ కాలంలో కరెంట్ లేకపోయేది. కరెంట్ బిల్లు చెల్లించే డబ్బుల్లేక క్యాండిల్ లైట్, మూన్‌లైట్ రెస్టారెంట్‌గా మల్చి తమ రెస్టారెంట్‌ను ప్రత్యేకంగా నిలబెట్టి జనాన్ని ఆకర్షించడం మొదలెట్టారు డిసౌజాలు. ఇప్పటికీ గోవాలో ఆ చంద్రకాంతిలో స్వేచ్ఛగా ఆడిపాడే క్యాసినోలు సముద్రతీరాల్లో, సముద్ర నడిబొడ్డున కనిపిస్తాయంటే.. తమకున్న ప్రతికూలతను అనుకూలంగా మార్చుకోవడమే కాకుండా ట్రెండ్ సెట్ చేసిన ఘనత కూడా డిసౌజాలది, టిటోస్ నైట్‌క్లబ్‌దే. ఓ చిన్న హోటల్‌గా ప్రారంభమై రెస్టారెంట్‌గా మారి ఇప్పుడేకంగా క్లబ్స్, రిసార్ట్స్, క్యాసినోస్, వాట్ నాట్ ఆతిథ్యరంగంలో టిటోస్ ఓ బ్రాండై అవతరించింది. గోవాలో దాదాపు ప్రతీ బీచ్‌లోనూ ఇప్పుడు టిటోస్ నైట్ క్లబ్స్, టిటోస్ ఏరీనాస్, మ్యాంబోస్, కేఫ్స్, రిసార్ట్స్, హోటల్స్, రెస్టారెంట్స్ ఇలా విస్తరించడంతో పాటు లక్షల మంది పర్యాటకులు ఈ టిటోస్‌ను సందర్శిస్తున్నారు. ఏకంగా ఒక లేన్ పేరే టిటోస్ లేన్‌గా గుర్తింపు పొందిందంటే నార్తర్న్ గోవాలో ఒక చిన్న హట్‌తో ప్రారంభమైన ఈ బిజినెస్ ఇంతింతై ఎంతలా ఎదిగింది, మొత్తంగా గోవా పర్యాటకాన్నే ఎలా ప్రభావితం చేసిందో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందేమీ లేదు.

షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, ఐశ్వర్యారాయ్ వంటి బాలీవుడ్ తారల నుంచీ.. రిచర్డ్ గేర్, కేట్ మాస్ వంటి ఇంటర్నేషనల్ స్టార్స్ వరకూ గ్లోబల్ సెలబ్రిటీస్ అంతా ఇప్పుడు టిటోస్‌కు క్యూ కడుతుంటారు. ఇక్కడ సెలబ్రిటీలకు ప్రత్యేకమంటూ ఏమీ ఉండదు. మిగిలినవారితో కలిసి వారూ గంతులేసే స్వేచ్ఛ.. ఎంజాయ్ మెంటే.. టిటోస్ ప్రత్యేకత. అందుకే సెలబ్రిటీస్‌కూ సామాన్యులతో కలిసి ఎంజాయ్ చేసే అవకాశాలను కల్పిస్తుండటమే టిటోస్‌ను సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ ఆదరించడానికి కారణమైంది.

ఇవాళ గోవా బేస్డ్‌గా సినిమాల రూపకల్పనకూ ఎంతో డిమాండ్ ఉంది. దిల్ చాహతా హై, గో గోవా గాన్ వంటి ఎన్నో లేటెస్ట్ బాలీవుడ్ సినిమాలు ఎంత పెద్ద హిట్స్ తెలిసిందే. ఆ పాత మధురాల్లోనూ గోవా పర్యాటకానికి ఓ ప్రత్యేక స్థానం కల్పించారంటేనే అర్థం చేసుకోవచ్చు.. గోవా సమ్థింగ్ స్పెషల్ అని.


గోవా అంటే పడమటి కనుమలు, అరేబియన్ సముద్రం, పోర్చుగీస్ వారి జ్ఞాపకాలను కళ్లకు కట్టే ఇళ్ల నమూనా. అద్భుతమైన శిల్పంతో కట్టిన పురాతన చర్చులు.. నహీ నహీ కభీ నహీ, భారత్ గోవా అలగ్ నహీ.. లాఠీ, గోలీ ఖాయేంగే, ఫిర్భీ గోవా జాయేంగే అంటూ సోషలిస్ట్ నాయకుడు మధు దండావతే వంటివారు పోర్చుగీస్ వారిని తరమికొట్టేందుకు చేసిన ఉద్యమ చరిత్ర. ఇలా ఇవన్నీ నాణానికి ఒకవైపు గోవా వింటేజ్ జ్ఞాపకాలను కళ్లకు కడితే.. నాణానికి మరోవైపు, గోవా అంటే సరసమైన ధరలకు లభించే మద్యం, జూదం.. గోవా అంటే నైట్ క్లబ్ డ్యాన్స్ కల్చర్.. గోవా అంటే మకావు.. ఇలా ఓవైపు నాటి సంప్రదాయకత.. మరోవైపు ప్రాశ్చాత్య సంస్కృతి మిళితమైన ఓ వైవిధ్యం గోవా. మొత్తంగా సంప్రదాయ భారతాన ఓ వైవిధ్యమైన ప్రాశ్చాత్య కల్చర్ కోసం ఇంకేదో దేశం వెళ్లాల్సిన పని లేకుండా ఇటు స్వదేశీయులకూ, అటు విదేశీయులకూ ఆతిథ్యమిచ్చే ఓ స్వర్గసీమ. అయితే, ఇంతలా గోవాను టూరిజంకు కేరాఫ్‌గా మార్చిన డిసౌజా బ్రదర్స్ ఇప్పుడు నాన్ ఆల్కాహాలిక్ కాఫీ షాపులను కూడా దేశవ్యాప్తంగా ఫ్రాంచైజీస్ స్థాపించేందుకు అడుగులు వేస్తున్నారు. అంతేకాదు బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో కూడా తమ ఆతిథ్య రంగాన్ని మరింత విప్లవాత్మకంగా మార్చేందుకు యత్నం జరుగుతోందంటున్నారు డిసౌజా బ్రదర్స్.



గోవా అంటే ఎందరికో ఓ కలల సామ్రాజ్యమనుకునే తరుణంలోనే సనాతన, సంప్రదాయాలను ఆచరించేవారికి గోవా వంటి పర్యాటకమన్నా డిసౌజా లాంటివారన్నా ఇష్టముండకపోవచ్చు. అయితే, డిసౌజాస్.. ఇవాళ గోవాను ప్రాశ్చాత్య నాగరికతకు కేరాఫ్‌లా తమ టిటోస్‌తో బీజం వేసి ఎంతలా ప్రభావితం చేశారో వారిలోనే మరో మానవీయ కోణమూ కనిపించడం విశేషం.

కోవిడ్–19 సమయంలో డిసౌజాస్ చేసిన సేవలు గోవా మరువలేనివి. చిన్నపిల్లలు, వృద్ధుల కోసం అనాథ శరణాలయాల నిర్వహణ, జంతు సంరక్షణ కేంద్రాల నిర్వహణ వంటి వెన్నో వారిలోని మానవత్వాన్ని చాటిచెప్పే స్వచ్ఛంద కార్యక్రమాలు.

మొత్తంగా టిటోస్ అంటే భారతదేశంలో 19 శతాబ్దపు చైతన్యానికి ఓ ప్రతీక. ఓ విప్లవం. అందుకే, గోవా టూరిజం గురించి తెలుసుకునే క్రమంలో గోవాకు అంత ప్రత్యేకత దక్కడానికి కారకుడైన డిసౌజాల పేర్లూ గోవా చరిత్రలో తప్పకుండా కనిపిస్తాయి.



\- రమణ కొంటికర్ల

## మంత్రి లోకేష్‌ని కలిసిన సాయిబాబు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ప్రభుత్వ విద్యాలయాలు, వసతిగృహాల్లో నిర్వహణ లోపం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా బీసీ, కేజీబీవీ హాస్టల్లో విద్యార్థినులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను భారతీయ జనతా యువమోర్చ రాష్ట్ర నాయకులు శిగిలిపల్లి సాయిబాబు కలిసి వివరించారు. మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసిన సాయిబాబు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపట్ల అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

## సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

జల్ జీవన్ మిషన్‌లో భాగంగా అన్ని గృహాలకు కుళాయిల ద్వారా నియోజకవర్గంలో తాగునీటిని అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలంలో కిష్టప్పపేట గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా అందించే కుళాయిలకు సంబంధించి శంకుస్థాపన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సురక్షిత మంచినీరు అందించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల్‌జీవన్ మిషన్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాయని, ఇందులో భాగంగా ఇంటింటికి కొళాయి కనెక్షన్‌ను ఇస్తున్నట్టు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అనుబంధ శాఖలన్నీ సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ప్రతి గృహానికి మంచినీటి కొళాయిని ఏర్పాటు చేసి సురక్షిత మంచినీటిని అందించి తద్వారా ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడాలన్నారు. అలాగే నీరు వృథా కాకుండా భావితరాలకు నీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జల్ జీవన్ మిషన్‌లో రాష్ట్రంలోనే నియోజకవర్గం అగ్రగామిగా ఉండేలా చూసుకోవాలని, లక్ష్యాలను సకాలంలో అధిగమించడానికి ఐఎస్ఏలు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కిష్టప్పపేట సర్పంచ్ అరసవల్లి సత్యవతి, వార్డు మెంబర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, డీఈలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చేనేతన్నల ర్యాలీ

(సత్యంన్యూస్, పొందూరు)

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బీజేపీ చేనేత జిల్లా సెల్ ఆధ్వర్యంలో పొందూరు కేంద్రంగా చేనేతన్నలతో ర్యాలీ నిర్వహించారు. చేనేత సొసైటీల నుంచి పెద్ద ఎత్తున నేతన్నలు పాల్గొన్నారు. నేతన్నలను ప్రోత్సహించాలి అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ సాగింది. చేనేత సెల్ జిల్లా కన్వీనర్ అల్లక పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బుధవారం చేనేత ర్యాలీలు జరుగుతున్నాయని, వారి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అనేక రుణాలు కల్పిస్తూ క్లస్టర్ల ద్వారా చేయూత ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, బీజేపీ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు, ఆర్టీషన్ సెల్ జిల్లా కన్వీనర్ సాతివిల్లి ప్రసాద్, బొండాడ వెంకటేష్, బాసిన దుర్గారావు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పేడాడ సూర్యకుమారి, మండల అధ్యక్షులు లోలుగు సింహాచలం, పూజారి చెల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు బలివాడ సత్యారావు, గురుగుబెల్లి రాజు, లక్ష్మీ నారాయణ, సొసైటీ అధ్యక్షులు సభ్యులు పాల్గొన్నారు.




## ఇసుక లారీని పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

గార నుంచి బైరి సింగుపురం జంక్షన్ వచ్చే మెయిన్‌రోడ్‌లో బైరి రెవెన్యూ గ్రామం దగ్గర అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని శ్రీకాకుళం రెవెన్యూ సిబ్బంది మంగళవారం అడ్డుకొని శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎచ్చెర్ల మండలం, చిలకపాలెంకు చెందిన లారీడ్రైవర్ చిలక ఆదినారాయణను పోలీసులకు అప్పగించారు. లారీని అడ్డుకున్నవారిలో బైరి, కరజాడ, పొన్నాం, బట్టేరులకు చెందిన గ్రామరెవెన్యూ అధికారులు వై.లక్ష్మణరావు, డి.పాపారావు, వి.ఎస్.గణేష్ ప్రసాద్, టి.యశ్వంత్ పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతోపాటు నగరంలోని పలు పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌నేరాలు, మైనర్ డ్రైవింగ్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాలను పోలీస్ అధికారులు నిర్వహించారు. పెరుగుతున్న సైబర్‌నేరాలు ప్రతి ఒక్కరు అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. లైసెన్సులు లేని డ్రైవింగ్, స్పీడ్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. సైబర్ నేరాలపై సమస్యలుంటే 1930 నెంబర్‌కు, ఇతర నేరాలకు డయిల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. ఫోన్‌కు వచ్చే ఫేక్ మెసేజెస్, రివార్డ్స్, ఫ్రీ రీఛార్జ్, లాటరీ విన్నర్స్ అంటూ వచ్చే సందేశాలపై స్పందిస్తే అకౌంటులో ఉన్న నగదు ఖాళీ అయిపోతుందన్నారు.




విద్యార్థులు కొన్నిరకాల యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారి సమస్య పరిష్కరించండి

(సత్యంన్యూస్, సీతంపేట)



గ్రంథాలయానికి రహదారి సమస్య కోసం ఐటీడీఏ పీవో రాహుల్ కుమార్ రెడ్డికి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు కలిసి వివరించారు. సమస్య పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు. రీడర్స్ కోసం పత్రికలు, మాగజైన్‌లు, టెట్, డీఎస్సీ పరీక్షల కోసం కొత్తగా పుస్తకాలు ఉన్నదీ లేదనిదీ ఈ సందర్భంగా పీవో అడిగి తెలుసుకున్నారు. రహదారి అందరికీ కనిపించే విధంగా చేద్దామని, ఇంతకు ముందు మెయిన్ రోడ్ ఎదురుగా కనిపించేదని, ఇప్పుడు కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించటం వల్ల వెనుక ఉండటం వల్ల ప్రజలకు ఇక్కడ గ్రంథాలయం ఉందని తెలియటం లేదని తెలిపారు. అందరికీ తెలియడానికి గ్రంథాలయ వారోత్సవాల సమయంలో అన్ని ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం, కొన్ని రకాల ఆటలు ద్వారా పిల్లలకు గ్రంథాలయం అవశ్యకతను వివరించామని గణేష్‌బాబు పీవోకు తెలిపారు.

## పచ్చిరొట్టతో నాణ్యమైన పంటలు

(సత్యంన్యూస్, వంగర)

రుతుపవనాలు ప్రారంభంలో రైతులు పంట పొలంలో పచ్చని ఆకులతో కూడిన సమతుల్యమైన పచ్చిరొట్ట ఎరువులు ఏకదళ ద్విదళ బీజాల పంటలు వేసి పంట వైవిధ్యాన్ని పాటించి పూతదశలో కలియదున్ని దేశవాళీ వరినాట్లు వేసినట్లయితే దిగుబడులు పెరిగి నాణ్యమైన పంటలు పండుతాయని ప్రకృతి వ్యవసాయం రైతు పెంకి గౌరీశ్వరరావు అన్నారు. వంగర మండలం కె.కొత్తవలస గ్రామపరిధిలో బుధవారం పచ్చిరొట్ట ఎరువులు అంతరపంటలు వేసి పూతదశలో కలియదున్ని వారం రోజులు మురగబెట్టి మైసూరు మల్లిక దేశవాళీ వరినాట్లు వేయించారు. గౌరీశ్వరరావు గత పదేళ్లుగా దేశవాళీ విత్తనాలు వేసి పంటలు పండిస్తున్నారు. తన పొలానికి పంటలు చూడడానికి వస్తున్న రైతులకు, విద్యార్థులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో పెంకి చైతన్యకుమార్, పెంకి చిన్నమ్మలు, రైతులు పాల్గొన్నారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి 8019 221 221

# నాడు అనారోగ్యం సాకు.. ఇప్పుడు మూడు పోస్టుల సోకు!

మొదటిపేజీ తరువాయి

పంచన చేరి వారం రోజుల్లోనే రెండు జిల్లాస్థాయి పోస్టుల బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే సీనియర్ లెక్చరర్‌గా ఉంటూ డైట్ కాలేజీ ప్రిన్సిపల్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు మరో రెండు అదనపు తోకలు చేరాయి. రెగ్యులర్ డైట్ ప్రిన్సిపల్‌కు మాత్రమే డీఈవోగా బాధ్యతలు అప్పగించాలనే స్టాండర్డ్ ఇన్‌స్ట్రక్షన్ ఉంది. కానీ ఈయన రెగ్యులర్ ప్రిన్సిపల్ కాదు. దాంతో పక్క జిల్లాలో ఉన్న రెగ్యులర్ డైట్ ప్రిన్సిపల్ ఎవరైనా వచ్చి ఇక్కడ డీఈవోగా చేరిపోతారని భావించి ఆ స్టాండర్డ్ ఇన్‌స్ట్రక్షన్‌ను కాదని డైట్‌లో సీనియర్ లెక్చరర్‌కు డీఈవో ఎఫ్ఏసీ బాధ్యతలు ఇవ్వాలని ఉత్తర్వులు తయారు చేయించుకున్నారు. వాస్తవానికి భీమిలీ డైట్‌కు రెగ్యులర్ ప్రిన్సిపాల్ ఉన్నారు. కుటుంబ, ఆరోగ్య కారణాల రీత్యా ఆర్‌జేడీ పోస్టును కాదనుకుని మరీ ఆమె భీమిలీ డైట్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. నిబంధనల ప్రకారం చూస్తే ఆమె డీఈవోగా ఇక్కడకు రావాలి. కానీ డైట్ సీనియర్ లెక్చరర్ అని మార్పించుకోవడంతో తిరుమల చైతన్యకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయి. గత నెల 30న రాత్రి 10 గంటలకు ఆర్‌జేడీ విజయభాస్కర్‌ను ఇన్‌ఛార్జి డీఈవో నియమిస్తూ పాఠశాల విద్యా కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇది తెలుసుకున్న తిరుమల చైతన్య టీడీపీ నేతలతో ఉన్నతాధికారులకు ఫోన్ చేయించి జిల్లాలో విద్యాశాఖ అస్తవ్యస్తంగా తయారైందని, దీన్ని చక్కదిద్దాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పించడం ద్వారా ఆ ఉత్తర్వులను రద్దు చేయించారు. ఆ తర్వాత గతంలో ఆర్‌జేడీగా పనిచేస్తూ జిల్లాలో ఇన్‌ఛార్జి డీఈవోగా వ్యవహరించిన జ్యోతి కుమారిని రెగ్యులర్ డీఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కానీ అది కూడా మారిపోయింది. అదే సమయంలో డీఈవో పోస్టింగ్ కోసం గతంలో అదనపు బాధ్యతలు నిర్వహించిన పగడాలమ్మ విశ్వ ప్రయత్నాలు చేసినా అవకాశం దక్కలేదని తెలిసింది.

### ఫిర్యాదులున్నా అదనపు బాధ్యతలు

గత ఏడాది జూన్‌లో జరిగిన బదిలీల సందర్భంగా డీఈవోగా అదనపు బాధ్యతల్లో ఉన్న తిరుమల చైతన్య పలు అక్రమాలకు పాల్పడ్డారంటూ ఉపాధ్యాయ సంఘాలన్నీ నెల రోజుల పాటు ఉద్యమించాయి. బదిలీ మార్గదర్శకాలు పాటించకుండా ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అనారోగ్య కారణాలు చూపించినా పట్టించుకోలేదని వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన అప్పటి ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్ ఫిర్యాదుదారుల అభ్యర్థనలను పరిశీలించి నోట్‌ఫైల్ పెట్టినా తిరుమల చైతన్య పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటి కలెక్టర్ పిలిపించి చీవాట్లు పెట్టినా తిరుమల చైతన్యలో మార్పు రాలేదు. 'నాడు-నేడు'లో అవకతవకలకు తిరుమల చైతన్య పాల్పడ్డారన్న ఫిర్యాదుపై సీఎంవో అధికారులు క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. నాడు-నేడు నిధులు, సిమెంట్, ఐరన్ పక్కదారి పట్టించారన్న ఫిర్యాదుపై మాజీ సీఎం జగన్ వ్యక్తిగత కార్యదర్శి ధనుంజయరెడ్డి అప్పటి కలెక్టర్ లాఠకర్‌తో విచారణ జరిపించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. విచారణ జరిగితే తనపై చర్యలు తప్పవని గ్రహించిన తిరుమల చైతన్య ఆరోగ్యం సహకరించడం లేదంటూ డీఈవో బాధ్యతల నుంచి తప్పుకొన్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికీ తిరుమల చైతన్యపై వచ్చిన ఆరోపణలు అలాగే ఉన్నా.. అప్పటి సీఎంవో ఇచ్చిన ఆదేశాలు రద్దు కాకపోయినా డీఈవోగా, ఏపీసీగా అతనికే అదనపు బాధ్యతలు అప్పగించారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు కారాలు మిరియాలు నూరుతున్నాయి. ఎవరి ప్రాపకంతో డీఈవోగా వచ్చారని ప్రశ్నిస్తున్నాయి.

### నాడు రోడ్డెక్కిన టీచర్లు.. ఇప్పుడూ ఆగ్రహం

వైకాపా నాయకులు ఇచ్చిన సిఫార్సు లేఖలకు న్యాయం చేసేందుకు గతంలో ఆయన కౌన్సెలింగ్ వ్యవస్థనే పూర్తిగా పక్కదారి పట్టించేశారనే ఆరోపణలు వచ్చాయి. వాటికి ఉదాహరణలతో బాధితులు రోడ్డెక్కారు. బదిలీల్లో మెడికల్ ప్రిఫరెన్షియల్ కేటగిరీని పరిగణనలోకి తీసుకోలేదని, బదిలీ కోరని వారికి దగ్గరి పోస్టింగ్‌లు ఇవ్వడం, ఎన్‌టైటిల్ పాయింట్స్‌లో నిబంధనలకు పాతరేయడం తదితర అంశాలపై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేశాయి. మాన్యువల్‌గా రీకౌన్సెలింగ్ నిర్వహించడం, ఎనిమిదేళ్లు పూర్తికాకపోయినా కొందరు మహిళా టీచర్లకు స్పౌజ్ పాయింట్లు కేటాయించడం ద్వారా బదిలీల ప్రక్రియను అస్తవ్యస్తంగా నిర్వహించారని తిరుమల చైతన్యపై విమర్శలు ఉన్నాయి. ఆయన అవగాహన రాహిత్యం, డబ్బుల యావ కారణంగా బదిలీ ప్రక్రియ నెల రోజుల పాటు సాగిందని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఏ ఎమ్మెల్యే ఆయన్ను ఇన్‌ఛార్జి డీఈవో బాధ్యతల్లో కూర్చోబెట్టారో ఆ ఎమ్మెల్యే చేసిన సిఫార్సులనే నిబంధనలకు అనుకూలంగా ఉన్నా తిరుమల చైతన్య పక్కన పెట్టేశారు. కొద్దిగా ఫేవర్ చేయండని అడిగితే.. ఎమ్మెల్యేను ఏకవచనంతో సంభోదిస్తూ నా ముందు వాడెంత? అనే రీతిలో కొందరు ఉపాధ్యాయులను అవమానించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. అపరిచితుడు సినిమాలో హీరో మాదిరిగా స్ప్లిట్ పర్సనాలిటీతో వ్యవహరిస్తారన్న విమర్శలున్నాయి. వాస్తవానికి వైకాపా ప్రభుత్వంలో పగడాలమ్మకు అన్యాయం జరిగింది. డీఈవోగా పని చేస్తుండగానే ఆమెను టెక్కలి డిప్యూటీ డీఈవోగా బదిలీ చేసి, ఆ తర్వాత పదోన్నతి వచ్చినా.. శ్రీకాకుళంలో పోస్ట్ ఖాళీ ఉన్నా ఇవ్వకుండా మన్యం జిల్లాకు పంపించేశారు. ఆమెకు సబ్జెక్ట్ లేకపోయినా నిబంధనల గురించి వివరిస్తే తెలుసుకునే జ్ఞానం ఉంది. ఆ మేరకు ఉపాధ్యాయ సంఘాలతో గొడవలు లేకుండా ఆమె పని చేసుకుపోయేవారు. ఇప్పుడు రెగ్యులర్ డీఈవోల బదిలీల్లో మళ్లీ పగడాలమ్మను తీసుకురావడానికి మంత్రి అచ్చెన్నాయుడు ప్రయత్నిస్తున్నట్టు భోగట్టా. కానీ ఈలోగా తిరుమల చైతన్య ఉపాధ్యాయ సంఘాలను రోడ్డెక్కించకుండా ఉండగలరా అనేదే ప్రశ్న.

## ఓబీసీ సాధనకు సమష్టి కృషి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో అన్ని జిల్లా కమిటీ నాయకులు సమష్టి కృషితో ఓబీసీ సాధనకు కృషి చేయాలని శిష్టకరణ ప్రతినిధులు పిలుపునిచ్చారు. స్థానిక శిష్టకరణ కళ్యాణ మండపంలో శిష్టకరణ ఓబీసీ సాధన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కుల పెద్దల సమష్టి కృషితో ఈ నెల 9 నుంచి 12 వరకు ఢిల్లీలో ఓబీసీ సాధన లక్ష్యంగా సంబంధిత కేంద్ర మంత్రులను, అధికారులను కలుస్తామన్నారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున నాయకులు ఢిల్లీ రావాలని పిలుపునిచ్చారు. అఖిలభారత శిష్టకరణ జాతీయ కార్యదర్శి సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ విద్య రంగాల్లో ఓబీసీ లేకపోవడం వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని, నేటి పరిస్థితులకు శిష్టకరణ సామాజికవర్గానికి ఓబీసీ ఎంతగానో అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డబ్బీరు శ్రీనివాస్ రావు (వాసు), విశాఖపట్నం శిష్టకరణ జిల్లా అధ్యక్షులు గొడబ ప్రభాకర్ దాస్, బద్రి మహంతి వెంకట్రావు, డబ్బీరు సత్యప్రసాద్, ఎస్‌వీడీ మురళీ, శర్మ, పట్టణ అధ్యక్షులు బెహరా రామచంద్రరావు పాల్గొన్నారు.




## సరస్వతి పుత్రులకు అండగా స్ఫూర్తి ఫౌండేషన్



(సత్యంన్యూస్, నరసన్నపేట)

చదువుకు డబ్బు, పేదరికం అడ్డు కాకూడదని, నేటి చదువే, రేపటి భవితని స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీవియాల్ ఉయ్యూరి అన్నారు. బుధవారం పోలాకి మండలంలోని నలుగురు నిరుపేద పిల్లల చదువుకు స్ఫూర్తి ఫౌండేషన్ అండగా నిలిచింది. నలుగురు విద్యార్థుల కుటుంబ కన్నీటిగాథను అంపలాంకి చెందిన పొట్నూరు వరప్రసాద్ ద్వారా తెలుసుకున్న హైదరాబాద్‌కి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ శ్రీవియాల్ ఉయ్యూరి స్పందించి పిల్లల చదువుకు అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. ఇప్పుడు నలుగురు పిల్లల తండ్రులు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారని, గత రెండేళ్లుగా బాధ్యతను తీసుకుంటున్నామని, చిన్నారులైన పొందరి వైష్ణవి, మనీషా, కణితి హరిణి, కణితి సాయిల చదువు పూర్తి బాధ్యతను ఎన్‌ఆర్ఐ శ్రీనివాసన్, కృష్ణల సహకారంతో తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా స్ఫూర్తి ఫౌండేషన్ అందించిన పుస్తకాల బ్యాగ్‌లను, కొంత నగదును చిన్నారులకు అందించారు. కార్యక్రమంలో పోలాకి శారద ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బాధిత చిన్నారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మత్తుకు దూరంగా ఉండాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ప్రస్తుత యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, దీని వల్ల మనతో పాటు కుటుంబం కూడా నాశనమవుతుందని, దీనికి దూరంగా ఉండాలని డాక్టర్ కొరెడ్ల రమాప్రభ సూచించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యూ సెంట్రల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణ - పరిష్కార మార్గాలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలి అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రమాప్రభ మాట్లాడుతూ నేడు శ్రీకాకుళం, విశాఖపట్నం డ్రగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిందని, దానిని అరికట్టాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలవుతున్నారని, దానివల్ల జీవితాలను కోల్పోతున్నారని, ఫోన్లు మంచికి మాత్రమే ఉపయోగించాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిస అవ్వడం వల్ల దొంగతనాలకు కూడా అలవాటు పడతున్నారని, చాలామంది అత్యాచారాలు చెయ్యడానికి కూడా వెనకాడడం లేదని తెలిపారు. ఆడపిల్లలు తనను తాను రక్షించుకోవడానికి సెల్ఫ్ డిఫెన్స్ లాంటి కోర్సులు నేర్చుకోవాలని, ఒలింపిక్స్ క్రీడల్లో మన దేశ అమ్మాయిలు బాగా రాణిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్, శ్రీ సాయి విద్యా మందిర్ డైరెక్టర్ లక్ష్మణరావు, క్రియేటివ్ చిల్డ్రన్ క్లబ్ జిల్లా కన్వీనర్ కృష్ణారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ రాజు, ఎం.సంతోష్, శ్రీకాకుళం టౌన్ కమిటీ సభ్యులు రాజు, రవి, ఆది నారాయణ, రాజు, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## నేతన్నలకు అండగా నిలవండి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)


నేతన్నలకు అండగా నిలవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని లావేరు మండలం అప్పాపురంలో బుధవారం చేనేత కార్మికుల గృహాలకు వెళ్లి నేతన్నలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మగ్గంపై పనిచేసే నేతన్నలను సన్మానించారు. కార్యక్రమంలో ముప్పిడి సురేష్, గంట్యాడ మహేష్, మధుబాబు, తోట య్యదొర, రాజాపంతుల ప్రకాష్‌రావు, డీజీఎం ఆనందరావు, మీసాల రమణ, లుకలాపు అప్పలనాయుడు, లంక నారాయణరావు, గొర్లె శ్రీనివాసరావు, జగ్గన్నదొర, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.



## డీఈవోను కలిసిన భాషోపాధ్యాయులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో భాషోపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ శ్రీకాకుళం జిల్లా శాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్యను కలిసింది. జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్లలోనూ భాషోపాధ్యాయులకు పదోన్నతులు, డీఈవో పూల్‌లో ఉన్న భాషా పండితుల ఉన్నతీకరణ, పని సర్దుబాటులో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:40గా గుర్తించాలని, హిందీ సబ్జెక్టు సంబంధించి పదో సెక్షన్ నుంచే రెండవ పోస్టు నియమించాలని, 3 నుంచి 10 తరగతులకు ఉన్న పాఠశాలల్లో రెండు తెలుగు పోస్టులను కేటాయించాలని, టెన్త్ హిందీ పాఠ్యపుస్తకాన్ని సరళీకృతం చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. జిల్లా విద్యాశాఖాధికారిని కలిసిన వారిలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు, ముఖ్య సలహాదారు రఘుపాత్రుని శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కుప్పన్నగారి శ్రీనివాసరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి గొడబ మేరీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి గంద్రేటి వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



## హోంగార్డు కుటుంబానికి నగదు చెక్కు అందజేత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

జిల్లా హోంగార్డు యూనిట్, రాజాం పోలీసు స్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ గత నెలలో మరణించిన హోంగార్డు కుటుంబానికి సహ ఉద్యోగుల ఆర్థిక సహాయం నగదు చెక్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి బుధవారం అందజేశారు. జిల్లాలో సహచర హోంగార్డులందరూ కలిసి స్వతహాగా అందజేసిన ఒక్కరోజు గౌరవ వేతనం నగదు మొత్తం సుమారు రూ.4.11 లక్షల చెక్కును హోంగార్డు కె.శ్రీనివాసరావు సతీమణి ఉదయ కుమారికి బుధవారం ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి ఉన్నారు.



## శాశ్వత అన్నదానానికి లక్ష విరాళం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

అరసవల్లిలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి బలగ మడ్డి వీధికి చెందిన జాక గురువులు, అచ్చమ్మ, గన్నమ్మలు విరాళం అందించారు. ముందుగా వీరు స్వామివారిని దర్శించుకుని తదుపరి శాశ్వత అన్నదాన పథకానికి రూ.1,01,116 ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఈవో అందజేశారు.

## తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నారాయణ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ గూడెం బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు బుధవారం గూడెం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కళాశాల చైర్మన్ రెడ్డి నారాయణరావు ప్రారంభించగా, గ్రామంలో ఉండే తల్లులకు బ్రెస్ట్ ఫీడింగ్ ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, గ్రామ సర్పంచ్, ఆరోగ్యశోభ సిబ్బంది పాల్గొన్నారు.




## జిల్లాలో చేనేతకు ప్రత్యేక గుర్తింపు ఉంది

### సిక్కోలు బ్రాండ్‌ను నిలబెట్టాలి: కలెక్టర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అతి పెద్దది చేనేత రంగమని, అటువంటి రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభిప్రాయపడ్డారు. చేనేత, జౌళి శాఖ, సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో 10వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం బుధవారం స్థానిక బాపూజీ కళామందిర్లో ఘనంగా జరిగింది. ముందుగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి బాపూజీ కళామందిర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే బాపూజీ కళామందిర్ ఆవరణలో చేనేత ఉత్పత్తుల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముఖ్య అతిథిగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేసిందని, ఈ పథకాల ద్వారా చేనేత కళాకారులకు మేలు జరిగిందని భావిస్తున్నట్లు చెప్పారు. మార్కెట్లో డిమాండ్ ఉంటే రానున్న భావితరాలు చేనేత వస్త్రాలు వాడేందుకు ముందుకు వస్తారని, అందరం చేనేత వస్త్రాలు వినియోగించి చేనేతను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. గతంలో పొందూరు ఖాదీకి అవార్డు దక్కిందని, అమెజాన్ ఫ్లిప్కార్ట్ లాగా ఒక యాప్ వచ్చిందని, డిజిటల్ ట్రాన్సాక్షన్ ఉత్పత్తిదారు నుంచి నేరుగా కస్టమర్‌కి నగదు జమ చేసుకోవచ్చున్నారు. పొందూరు పర్యటిస్తానని, చేనేత కార్మికులకు ప్రభుత్వం తరఫున ఎటువంటి సహాయం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో వికలాంగ చేనేత కళాకారుడు తిలారు గ్రామానికి చెందిన మచ్చా శ్రీనివాసరావుకు, సీనియర్ చేనేత కళాకారులకు కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సంపతిరావు శ్రీదేవి, డాక్టర్ హర్షవల్లి చేనేత ఉత్పత్తుల గూర్చి వివరించారు. చేనేత జౌళి శాఖ ఏడీ సాయిప్రసాద్ మాట్లాడుతూ ఏడీఎన్‌హెచ్‌డీసీ ద్వారా రానున్న 15 రోజుల్లో నేత బజార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 15 శాతం రాయితీతో నూలు పొందవచ్చున్నారు. మిల్లు రంగానికి పోటీగా చేనేత రంగాన్ని సులభతరం చేసేందుకు, అర్హులైన లబ్ధిదారులకు 15 శాతం సబ్సిడీ ధరకు ముడిసరుకు అంటే నూలు అందుబాటులో ఉంచడం ఈ పథక లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం రమేష్ క్రిష్ణ, ఆర్ట్ స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ సన్యాసిరావు, ఆప్కో ఐవో లక్ష్మీ నారాయణ, డీవో శ్రీనివాసరావు, ఏడీవోలు రమేష్, చేనేత రంగ ప్రతినిధులు, సంఘ ప్రతినిధులు, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రజాకార్లు.. జియా కుమారుడే కుట్రదారులు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. 2018లో ఖలీదా జియాను అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో పార్టీ తాత్కాలిక అధ్యక్షుడిగా తారిక్ రెహ్మాన్‌ను నియమించారు. అప్పటి నుంచి షేక్ హసీనాకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నాడు. కొన్ని నెలలుగా జరుగుతున్న రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా మలచడంలో ఈయన పాత్ర ఉందంటున్నారు. లండన్‌లో ఉంటున్న ఈయన అక్కడి నుంచే పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ సాయం తీసుకుని బంగ్లాదేశ్‌లో ఉద్యమిస్తున్న విద్యార్థులను రెచ్చగొట్టి అల్లర్లకు పురిగొల్పారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. హసీనా ప్రభుత్వాన్ని పడదోసి తన తల్లి ఖలీదా జియాను గద్దె దించడమే లక్ష్యంగా ఈ కుట్రకు వ్యూహరచన చేశారని ఇంటెలిజెన్స్ సమాచారం. తారీఖ్ రెహ్మాన్ సౌదీ అరేబియాకు వెళ్లి అక్కడ ఉన్న ఐఎస్ఐ అధికారులను కలిసి ప్లాన్ చేశాడు. ఆ ప్రకారం సోషల్ మీడియాలో పాకిస్థాన్ నుంచి యాంటీ బాంగ్లాదేశ్ పోస్ట్‌లు పెట్టించి ఆ దేశ యువతను రెచ్చగొట్టారు. హసీనా ప్రభుత్వంపై మొత్తం 500 ట్వీట్లు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తొలి నుంచీ పాకిస్థాన్‌కు మద్దతుగా నిలుస్తోంది. దాంతో ఖలీదా జియాకు, ఆమె కుమారుడికి ఏం కావాలన్నా పాకిస్తాన్ చేసిపెడుతోంది. ఈ అల్లర్లలో పాక్‌తోపాటు చైనా కూడా కీలక పాత్ర పోషించింది. జమాత్ ఇ ఇస్లామీ అనుబంధ విద్యార్థి సంఘమైన ఐసీఎస్ (ఇస్లామీ ఛాత్ర శిబిర్) హసీనా ప్రవేశ పెట్టిన కోటా బిల్లుపై రేగిన ఆందోళనలను ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మార్చింది. ఈ సంస్థకు పాకిస్థాన్ నుంచి చైనాకు చెందిన కొన్ని సంస్థలు ఫండింగ్ చేస్తున్నట్లు సమాచారం. ఈ అల్లర్ల నేపథ్యంలోనే బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ సహబుద్దిన్ హసీనా ప్రభుత్వాన్ని రద్దు చేయడంతో పాటు జైలులో ఉన్న ఖలీదా జియాను విడుదల చేయించడం ఈ కుట్ర నిజమేనని చెబుతోంది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.